

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర **రాజముద్ర**
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA · RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 26.05.2026 | సంపుటి: 3 | సంచిక: 114 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 26.05.2026 | V0LUME : 3 | ISSUE : 114 | PAGES: 8 | COST: 2/- |


**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



- 8 వేల మహిళా సంఘ భవనాలకు ఒకేసారి శంకుస్థాపన
- మహిళా సంఘాలతోనే 1,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు

# మహిళా శక్తికి భారీ ప్రోత్సాహం

రైస్ మిల్లులు, గోడౌన్లు, సూపర్ బాజార్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధం
2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**హైదరాబాద్, మే 25(రాజముద్ర న్యూస్):**
రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం కీలక కార్యక్రమాలను ప్రకటించింది. మహిళా వారోత్సవాల సందర్భంగా సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో 8 వేల స్వయం సహాయక

మిగతా 2వ పేజీలో..

2

## ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

- కేంద్రం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప కొనుగోలు చేయడం లేదు

# హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్!




- ఐఆర్ఎఫ్‌సీతో కీలక రుణ ఒప్పందం కుదుర్చుకున్న మెట్రో సంస్థ
- పట్టణ రవాణా విస్తరణకు దీర్ఘకాలిక ఆర్థిక బలం
- మెట్రో విస్తరణ ప్రణాళికలకు రానున్న కొత్త ఊపు
- అధిక వడ్డీ రుణాల స్థానంలో తక్కువ వ్యయ ఫైనాన్సింగ్
- ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వానికి భారీ ఊరట కలగనున్నది
- రోజుకు ఐదు లక్షల మందికి సేవలందిస్తున్న మెట్రో
- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా అడుగు
- కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో కీలక ఒప్పందం విజయవంతం

**తెలంగాణ బ్యూరో, రాజముద్ర న్యూస్ :**
తెలంగాణ రవాణా వ్యవస్థలో మరో కీలక ఘట్టం నమోదైంది. హైదరాబాద్ నగర పట్టణ రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గరిష్ఠంగా రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ రుణం లభించింది. ఈ మేరకు ఢిల్లీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ, సీఈఓ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో

మిగతా 2వ పేజీలో..

# కాళేశ్వరంలో భక్తుల సందడి

- వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలతో కిక్కిరిసిన ఘాట్లు
- పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు

3





# టీజీఎస్పీడీసీఎల్ లో చెట్ల కొమ్మల తొలగింపుకు ఆధునిక యంత్రాలు

- విద్యుత్ అంతరాయాలు తగ్గించడమే లక్ష్యం
- జీహెచ్ఎంసీతో సమన్వయం చేసుకుని కొమ్మల తొలగించాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్
- జూబ్లీహిల్స్‌లో పనులను పరిశీలన

2




# ఉగ్రదాడుల్లో శిక్షణ ఇవ్వండి

ఉగ్రమూకలతో చాటింగ్
మేడ్చల్ పోలీసులకు పట్టుబడ్డ జాహెద్ ఖాన్
బొమ్మ తుపాకులతో రీల్స్
తుపాకుల కోసం ఇన్స్టా గ్రూప్లో వెతికిన జాహెద్
ఐఎస్ఐకు దేశభద్రతకు సంబంధించిన సమాచారం
పాక్ ఉగ్రవాదితో చాటింగ్
కీలక సమాచారం రాబట్టిన పోలీస్ శాఖ

**తెలంగాణ బ్యూరో, రాజముద్ర న్యూస్:**
తెలంగాణలో మరో ఉగ్రవాది అరెస్ట్ కలకలం లేపింది. దేశంలో ఎక్కడ ఉగ్రవాది పట్టుబడ్డ హైద్రాబాదుతో లింకులు వస్తుంటాయి.కానీ ఓ వ్యక్తి హైదరాబాద్ శివారులో ఉంటూ పాక్ ఉగ్రవాదులతో తరచూ మాట్లాడుతుండటం, తుపాకుల కోసం ఆన్లైన్ సెర్చ్ చేయడం వంటి కార్యకలాపాలు ఇంటెలిజెన్స్

మిగతా 3వ పేజీలో..

# "ఒక్క ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా"



- హైడ్రాతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- 420 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్
- 2028లో మళ్లీ కేసీఆర్‌దే అధికారం అంటూ ధీమా
- జూన్ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

2



# భగ్గుమంటున్న తెలంగాణ

2

- రోహిణీ కార్తె ఎఫెక్ట్‌తో 46.5 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- కుమురం భీం నుంచి సూర్యాపేట వరకు రెడ్ అలర్ట్ పరిస్థితి

# ధాన్యం నిల్వలపై ఆకస్మిక తనిఖీలు

- రైస్ మిల్లులపై మంత్రి ఆగ్రహం
- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- మిల్లులు, గోదాముల వద్ద పోలీసు నిఘా

3





# రైతు గోస బీజేపీ భరోసా

- గజ్వేల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్న నాయకులు
- పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు

2

# మోదీ క్యాబినెట్‌లో కిషన్ రెడ్డి మార్క్..

- పనితీరులో దేశంలోనే నంబర్ 1 మంత్రిగా రికార్డ్!

**హైదరాబాద్, రాజముద్రన్యూస్:**
కేంద్ర ప్రభుత్వంలో తెలుగు నేతలు తమదైన ముద్ర వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర

మిగతా 2వ పేజీలో..



# హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్!

**మొదటిపేజీ తరువాయి**

మెట్రోను మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఈ కీలక ఆర్థిక ఒప్పందం కుదిరిందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతమైన, సుస్థిరమైన, ప్రజానుకూల రవాణా వ్యవస్థ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక నగరంగా ఎదుగుతోందని, వేగవంతమైన పట్టణ విస్తరణకు అనుగుణంగా మెట్రో కనెక్టివిటీ విస్తరణ అత్యంత అవసరమని చెప్పారు. నగర ట్రాఫిక్ రద్దీ తగ్గించడంలో, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో మెట్రో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్ వల్ల ప్రాజెక్టుకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని, దీని ద్వారా మెట్రో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుందని తెలిపారు. ప్రస్తుత రుణభారం తగ్గడంతో పాటు భవిష్యత్ మెట్రో విస్తరణ ప్రణాళికలకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ రుణ సౌకర్యాన్ని నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ క్యాపిటల్ రీఫైనాన్సింగ్ వంటి అవసరాలకు వినియోగించనున్నారు. ఈ రుణాన్ని ఇరవై సంవత్సరాల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో రూపొందించారు. ప్రస్తుతం ఉన్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వ్యయంతో కూడిన దీర్ఘకాలిక రూపాయి ఫైనాన్సింగ్‌తో భర్తీ చేయనున్నారు. దీంతో ప్రాజెక్టు ఆర్థిక నిర్వహణ మరింత సులభతరం కానుంది. ఈ లావాదేవీకి తెలంగాణ ప్రభుత్వ నిర్బంధ చెల్లింపు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ, రిజర్వ్ బ్యాంకు మద్దతుతో డైరెక్ట్ డెబిట్ మాండేట్ వంటి బలమైన క్రెడిట్ వ్యవస్థ మద్దతుగా నిలిచాయి. దీంతో రుణదాతలకు భద్రతతో పాటు ప్రాజెక్టుపై విశ్వాసం పెరిగినట్లు అధికారులు తెలిపారు. 69.2 కిలోమీటర్ల పొడవుతో మూడు కారిడార్లు, 57 స్టేషన్లతో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ దేశంలో పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసిన అతిపెద్ద మెట్రో ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ మెట్రో నెట్‌వర్క్ ద్వారా రోజుకు ఐదు లక్షల మందికి పైగా ప్రయాణికులు సేవలు పొందుతున్నారు. ఈ రీఫైనాన్సింగ్ వల్ల భవిష్యత్‌లో కొత్త కారిడార్లు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ, చివరి మైలు రవాణా సదుపాయాల విస్తరణకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. హైదరాబాద్ మెట్రో భవిష్యత్ విస్తరణలకు ఇది బలమైన ఆర్థిక పునాది అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సుస్థిరమైన, సమర్థవంతమైన, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థ నిర్మాణంలో ఈ ఒప్పందం కీలక ముందడుగుగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్, ఎల్ అండ్ టీ మెట్రో ప్రతినిధులు, ఐఆర్ఎఫ్‌సీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీ క్యాబినెట్‌లో కిషన్ రెడ్డి మార్క్..

**మొదటిపేజీ తరువాయి**

మంత్రివర్గంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మంత్రుల జాబితాలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధికారికంగా విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో కిషన్ రెడ్డి కి ప్రథమ స్థానం దక్కింది. మంత్రుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ వేగం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలతో అనుసంధానం వంటి కీలక అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించారు.

**పనితీరుకు నిదర్శనం ఈ ర్యాంక్**

బొగ్గు , గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కిషన్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. శాఖాపరమైన నిర్ణయాల్లో వేగం పెంచడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను అత్యంత వేగంగా పరిష్కరించడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడంలో ఆయన చూపిన చొరవను కేంద్రం గుర్తించింది. ఈ ర్యాంకింగ్స్‌లో కిషన్ రెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా టాప్ పెర్ఫార్మర్ల జాబితాలో నిలిచారు.

**విష్ణువర్ధన్ రెడ్డి అభినందనలు**

కిషన్ రెడ్డికి అగ్రస్థానం దక్కడంపై ఏపీ బీజేపీ సీనియర్ నేత, జాతీయ కౌన్సిల్ సభ్యుడు యస్. విష్ణువర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి నిబద్ధత, నిజాయితీ వల్లే ఈ గుర్తింపు లభించిందని, ఇది తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. మోదీ టీంలో నంబర్ వన్ మంత్రిగా నిలవడం ఆయన సమర్థతకు నిదర్శనమని కొనియాడారు.


**రిపోర్టులోని ముఖ్యాంశాలు**

ఈ రిపోర్టు ప్రధానంగా డిజిటల్ ఫైల్ మూవ్‌మెంట్, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, మినిస్ట్రీ అవుట్‌పుట్ ఆధారంగా రూపొందించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే తన శాఖను దేశంలోనే ముందంజలో ఉంచిన కిషన్ రెడ్డిపై రాజకీయ వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# టీజీఎస్పీడీసీఎల్ లో చెట్ల కొమ్మల తొలగింపుకు ఆధునిక యంత్రాలు

**తెలంగాణ బ్యూరో, మే 25:**

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ పరిధిలో జరుగుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సోమవారం పరిశీలించారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో ఉన్న 11కేవీ అయ్యన్న ఫీడర్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన సీఎండీ, ఫీల్డ్ సిబ్బంది వినియోగిస్తున్న బ్యాటరీ ఆధారిత చెట్ల కొమ్మల కత్తిరింపు యంత్రాలు, మొబైల్ బకెట్ ల్యాడర్ల పనితీరును దగ్గరుండి గమనించారు. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ యంత్రాలతో పోలిస్తే కొత్త బ్యాటరీ యంత్రాల పనితీరు ఎలా ఉందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ సిబ్బంది మాట్లాడుతూ బ్యాటరీ యంత్రాలతో పని సులభంగా జరుగుతోందని, శబ్ద కాలుష్యం తక్కువగా ఉండటంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతున్నాయని తెలిపారు. అలాగే వీటిని సులభంగా ఒకచోటినుంచి మరోచోటికి తరలించవచ్చని పేర్కొన్నారు. పనులు వేగంగా, సురక్షితంగా పూర్తి చేసి విద్యుత్ అంతరాయాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీఎండీ అధికారులను ఆదేశించారు. చెట్ల కొమ్మలు తొలగించిన తర్వాత వాటిని రోడ్లపై వదిలేయకుండా వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని డంప్ యార్డులకు తరలించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యుత్ శాఖలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా పనితీరు మెరుగుపర్చడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. సీఎండీ పర్యటనలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింలు,, సీఈ మెట్రోజోన్ బిక్షపతితో పాటు ఎస్ఈ బంజారాహిల్స్, డీఈ బంజారాహిల్స్ పాల్గొన్నారు.



# మహిళా శక్తికి భారీ ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**



సంఘాల భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకేసారి శంకుస్థాపన చేశారు. మహిళల ఆధ్వర్యంలో భారీ వ్యాపార, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సంఘాలను సాధారణ పొదుపు సమూహాలుగా కాకుండా పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు.

రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు పెద్ద కార్పొరేట్ సంస్థలకే పరిమితమైన రంగాల్లో మహిళలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పెట్రోల్ బంకుల నిర్వహణలో కూడా మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

మహిళల వ్యాపార విస్తరణకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల రుణాలు అందించామని, సున్నా వడ్డీ పథకం కింద ప్రభుత్వం రూ.1,390 కోట్లు చెల్లించిందన్నారు. మహిళలు తీసుకున్న అప్పులను నిజాయితీగా చెల్లిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

మండల స్థాయిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూములు కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. మహిళా సంఘాలే నేరుగా ధాన్యం కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేసే విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన రుణాలను సున్నా వడ్డీతో అందిస్తామని వెల్లడించారు.

పట్టణ ప్రాంతాల్లో 'మహిళా శక్తి సూపర్ బాజార్లు' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పడే ఈ సూపర్ మార్కెట్లకు ప్రభుత్వ భూములను తక్కువ ధరకు లీజుకు ఇవ్వనున్నట్లు చెప్పారు. నాణ్యమైన వస్తువులతో వినియోగదారులను ఆకట్టుకునేలా ఈ కేంద్రాలను అభివృద్ధి చేయాలని సూచించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కొనసాగుతోందని, ఇప్పటివరకు ఆర్టీసీకి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల వరకు చెల్లించిందన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా ప్రోత్సహించే దిశగా వెయ్యి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 5న 553 బస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో మహిళల ఆశీర్వాదాలతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని సీఎం పేర్కొన్నారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

- **హమాలీల కొరతతో ధాన్యం తరలింపులో ఇబ్బందులు**
- **మూసీ పునరుజ్జీవంతో ఉపాధి, పర్యాటక అభివృద్ధి**

**హైదరాబాద్, మే 25**


రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప పంట కొనుగోలు విషయంలో బాధ్యత తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కనీసం 30 శాతం ధాన్యాన్ని కూడా కేంద్రం సేకరించడం లేదన్నారు.

సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసింది. కార్మికుల కనీస వేతనాల పెంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సీపీఎం నేతలు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సీఎం స్పందించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు అక్కడికి వెళ్లడంతో రాష్ట్రంలో కొంత కొరత ఏర్పడిందన్నారు. ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం వేళల్లో పనులు మందగిస్తున్నాయని చెప్పారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు సేకరిస్తున్నామని వెల్లడించారు. మూసీ నిర్వాసితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. స్థానికంగానే వారికి నివాసాలు కల్పిస్తామని తెలిపారు. ఈ అంశంపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మూసీ పునరుజ్జీవంతో నగరానికి కొత్త రూపు వస్తుందని, దాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. నగర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

# భగ్గుమంటున్న తెలంగాణ

- **హైదరాబాద్‌లోనూ ఉక్కపోత.. మధ్యాహ్నం రోడ్లపై కనిపించని జనాలు**
- **మరో మూడు రోజులు ఇదే తీవ్రత.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**హైదరాబాద్, మే 25:**



తెలంగాణలో ఎండలు భయపెడుతున్నాయి. రోహిణీ కార్తె ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి 46.5 డిగ్రీల వరకు నమోదవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలతో మధ్యాహ్నం సమయాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

తెలంగాణ ప్రణాళికా అభివృద్ధి సంస్థ విడుదల చేసిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు నమోదయ్యాయి. నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఎండలు నమోదయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదై రెడ్ అలర్ట్ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ఎండ తీవ్రత పెరిగింది. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్‌మల్కాజ్‌గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే నమోదై కొంత ఉపశమనం కనిపించింది. అయితే రానున్న మూడు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45.7 డిగ్రీల వరకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వేళల్లో అవసరం లేకుండా బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# రైతు గోస - బీజేపీ భరోసా

**గజ్వేల్ టౌన్, మే 25, అఖండదీపం:**

రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం ముట్రాజ్ పల్లి రింగ్ రోడ్డు, సంగాపూర్ రింగ్ రోడ్డు మీదుగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ చేరుకొని రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల గోస కాంగ్రెస్ పార్టీకి తగులుతుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని, పేరుకే ఐకేపీ సెంటర్లు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రైతులు పండించిన పంట రోడ్ల పైన, కల్లాలలో, ఐకేపీ సెంటర్లలో నిలిచిపోయిందన్నారు. రోహిణి కార్తీ ప్రారంభమైనప్పటికి పండించిన పంట కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉండడంతో అకాల వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, రాత్రింబవళ్లు ధాన్యం వద్దే కాపలా కాస్తున్నారని, తాటిపాత్రులతో ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ వాతావరణం లో వచ్చిన మార్పులకి రైతులు ఇబ్బంది పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి కి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని, అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంత వరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని, తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకులు, జిల్లా రథసారథులు, మండల నాయకులు, సర్పంచులు, గజ్వేల్ పట్టన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# "ఒక్క ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా"

- **హైడ్రాతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు**
- **420 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు**
- **కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్**
- **2028లో మళ్లీ కేసీఆర్‌దే అధికారం అంటూ ధీమా**
- **జూన్ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం**

**హైదరాబాద్, మే 25:**



"హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమావేశానికి ఎమ్మెల్యేలు వివేక్ గౌడ్, నవీన్ రావు, శంభీపూర్ రాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై సమావేశంలో చర్చించారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు హైదరాబాద్ భవిష్యత్‌పై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయని, కానీ కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని కేటీఆర్ పేర్కొన్నారు. పేదలకు ఇబ్బందులు కలగకుండా పాలన అందించామని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి జీఓ 58, 59 ద్వారా పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం "ఇందిరమ్మ రాజ్యం", "ప్రజా పాలన" పేరుతో హైడ్రా ద్వారా పేదల ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు. కొత్త ఇళ్లు నిర్మించకపోగా వేల సంఖ్యలో ఇళ్లను నేలమట్టం చేస్తోందని ఆరోపించారు.

పెన్షన్ల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం రూ.200 నుంచి రూ.2 వేల వరకు పెంచిందని, కానీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అసాధ్య హామీలతో ఓట్లు సాధించి ఇప్పుడు ప్రజలను నిరాశపరిచిందని వ్యాఖ్యానించారు.

"ముఖ్యమంత్రి జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతుంటే జేబుదొంగ అనుకోవద్దు.. ఆయన గజదొంగ" అంటూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో నాలుగు వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని ఆరోపించారు. గృహ నిర్మాణ కార్మికులకు అండగా నిలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. జూన్ నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

2028 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.





# యాతాలకుంట టన్నెల్ పరిశీలన

- **పనుల పురోగతిపై సమీక్ష**
- **సాగునీటి సదుపాయాలపై దృష్టి**
- **వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు**

**ఖమ్మం, మే 25**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలస్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యాతాలకుంట ప్రాంతంలో కొనసాగుతున్న ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాలు మరింత మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రైతులకు నీటి సమస్య తగ్గి వ్యవసాయ రంగానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భారీ స్థాయిలో సాగునీటి ప్రాజెక్టులను అమలు చేస్తోందని వెల్లడించారు. పనుల పరిశీలన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. టన్నెల్ నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించి అవసరమైన చోట ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జారే ఆదినారాయణ పాల్గొని ప్రాంత ప్రజల సమస్యలు, సాగునీటి అవసరాలు, అభివృద్ధి పనుల ప్రాధాన్యతపై మంత్రికి వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, రహదారులు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు సానుకూలంగా స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు టన్నెల్ నిర్మాణ పనుల వివరాలను మంత్రికి సమగ్రంగా వివరించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన దశలు, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై నివేదిక సమర్పించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా అదనపు యంత్రాంగాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. స్థానిక రైతులు, ప్రజలు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. సాగునీటి సదుపాయాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రారంభమైన రోహిణి కార్తె

- **జూన్ ఏడు వరకు ఎండల తీవ్రత**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**
- **వడదెబ్బ ముప్పుపై వైద్యుల సూచనలు**

**హైదరాబాద్, మే 25**



తెలుగు పంచాంగం ప్రకారం అత్యంత శక్తిమంతమైన రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. జూన్ ఏడు వరకు కొనసాగనున్న ఈ కాలంలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ రోజుల కంటే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే మండుతున్న ఎండలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతుండగా, రోహిణి కార్తె ప్రభావంతో వడగాలులు, ఉక్కపోత మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని చెబుతున్నారు. రోహిణి కార్తె కాలాన్ని సంప్రదాయంగా అత్యంత వేడిగా ఉండే దశగా భావిస్తారు. ఈ సమయంలో భూమి ఉపరితలం తీవ్రంగా వేడెక్కడం వల్ల గాలి ఉష్ణోగ్రతలు కూడా అమాంతం పెరుగుతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారిపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచే మండే ఎండలు, మధ్యాహ్నం వడగాలులు, రాత్రి పూట ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల నీరసం, తలనొప్పి, అలసట, డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువసేపు తిరగడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగి ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ ప్రభావం అత్యధికంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితులు తప్ప ఆ సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, ముఖానికి గుడ్డ కట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. లేత రంగు పత్తి దుస్తులు ధరించడం ద్వారా శరీరంపై వేడి ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి తరచూ మంచి నీరు తాగడం అత్యంత అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా కొద్దికొద్దిగా నీరు తీసుకోవాలని చెబుతున్నారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఉప్పు చక్కెర కలిపిన ద్రావణాలు వంటి పానీయాలు శరీరంలో నీటి శాతం నిలుపుకోవడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా బయట పనులు చేసే వారు నీటి సీసాలు వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. పుచ్చకాయ, దోసకాయ, కర్బూజ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వేడి ఎక్కువగా ఉండే సమయంలో మసాలా, నూనె పదార్థాలు తగ్గించి తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరుతున్నారు. రోహిణి కార్తె కాలంలో నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# సంగారెడ్డిలో అటవీ శాఖ భవనాల ప్రారంభం

- **మంత్రుల జిల్లా పర్యటన**
- **అటవీ సంరక్షణకు ప్రాధాన్యత**
- **అర్బన్ ఎకో పార్కుల అభివృద్ధికి చర్యలు**

**సంగారెడ్డి, మే 25**

రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండ సురేఖ సోమవారం సంగారెడ్డి జిల్లా పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ అధికారుల వసతి గృహాలను ప్రారంభించారు. సుమారు ముప్పై రెండు లక్షల ఇరవై మూడు వేల రూపాయల వ్యయంతో ఈ వసతి గృహాలను నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ భవనాలు అటవీ శాఖ సిబ్బందికి ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రులు ఒక కోటి నలభై నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన జిల్లా అటవీ సంరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఆధునిక వసతులతో ఈ కార్యాలయాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. జిల్లా అటవీ శాఖ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలో అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాలో అర్బన్ ఎకో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నగర ప్రాంతాల్లో పచ్చదనం పెంపుతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో అర్బన్ ఎకో పార్కులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పార్కుల ద్వారా ప్రజలకు విశ్రాంతి వాతావరణంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అడవుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో అటవీ అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అధికారులు తెలిపారు. మొక్కల పెంపకం, అడవుల విస్తరణ, పర్యావరణ సమతుల్యత కాపాడే కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో అడవుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్, తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పోలీసు అధికారి పరతోష్ పంకజ్ పాల్గొన్నారు.

# కోహెడలో భూసేకరణ ఉద్రిక్తత

- **అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు**
- **జేసీబీ ముందు పడుకుని నిరసన**
- **భారీగా పోలీసుల మోహరింపు**

**రంగారెడ్డి, మే 25**

రంగారెడ్డి జిల్లాలోని కోహెడ గ్రామంలో భూసేకరణ అంశంపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫ్రూట్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కోసం అధికారులు భూముల పరిశీలనకు రావడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. తమ భూములను బలవంతంగా తీసుకోవద్దంటూ అధికారులను అడ్డుకున్నారు. గ్రామస్తులు మండుటెండలో కూడా వెనక్కి తగ్గకుండా జేసీబీ యంత్రాలకు అడ్డంగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతే జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా భూసేకరణ చేపట్టరాదని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అధికారులు గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం చేయగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని తోపులాట జరిగినట్లు సమాచారం. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు భారీగా మోహరించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ చేపడుతున్నామని అధికారులు గ్రామస్తులకు వివరించినట్లు సమాచారం. అభివృద్ధి పనుల కోసం భూములు అవసరమని చెప్పినా గ్రామస్తులు అంగీకరించలేదు. సరైన పరిహారం, స్పష్టమైన హామీలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా నిర్వహిస్తున్నారు. పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అధికారులు గ్రామ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. భూసేకరణ అంశంపై ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలపై స్థానికంగా ఉత్కంఠ కొనసాగుతోంది.



# కాళేశ్వరంలో భక్తుల సందడి

**మహదేవపూర్, మే 25**

శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం సందర్భంగా కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీ భారీగా పెరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాలు ఆచరించారు.

పుష్కరాల ఐదో రోజు సోమవారం త్రివేణి సంగమం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివనామస్మరణ మధ్య భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి నీరాజనాలు అర్పించారు. అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదిలో స్నానం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందన్న విశ్వాసంతో తెల్లవారుజాము నుంచే ఘాట్లకు భక్తులు తరలివచ్చారు.

భక్తుల రద్దీ పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పుష్కర ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు నదిలో లోతట్టు ప్రాంతాలకు భక్తులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, బోట్లను అందుబాటులో ఉంచి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు.

పుష్కరాల్లో దానధర్మాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పురాణాలు చెబుతున్నాయి. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు దీపదానాలు, ఇతర దానాలు నిర్వహించారు. పుష్కర సరస్వతి ఒడిలో స్నానం చేసి పూజలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు పేర్కొన్నారు.

# ఉగ్రదాడుల్లో శిక్షణ ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

దృష్టికి వచ్చాయి. దింతో ఉత్తర్ ప్రదేశ్ లోని ఘజియాబాద్ జిల్లాకు చెందిన జాహెద్ ఖాన్ ను మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జాహెద్ ఖాన్ ను విచారించిన పోలీసులకు కీలక సమాచారం లభించింది. 2023 లో బొమ్మ తుపాకులతో జాహెద్ ఖాన్ రీల్ చేసినట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఇస్లాం కోసం పోరాటానికి సిద్ధమంటూ ఇన్స్టాలో ఉగ్రదాడులు శిక్షణ ఇవ్వాలని కోరడం వెలుగులోకి వచ్చింది. ఇంస్టా లోని ఒక గ్రూప్లో ఇలా 1000 మంది కి పైగా ఉన్నట్టు తెల్సింది. ఈ మేరకు తుపాకుల కోసం జావేద్ అబిద్ రానా అనే వ్యకిని సంప్రదించినట్టు పోలీస్ విచారణలో తేలింది.తుపాకులు పొందడం ద్వారా ఉగ్ర దాడులు చేయాలనీ జావేద్ ఖాన్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. జావేద్ పాక్ డాన్ నవజాద్ తో సైతం చాట్ చేసినట్టు. దేశానికి సంబందించిన కొంత సమాచారాన్ని చేరవేసినట్టు విచారణలో తేలింది. జావేద్ ఇదివరకు కలకత్తా లో ఓ వస్త్ర దుకాణంలో సైతం పని చేసినట్టు తెలిసింది. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు జావేద్ ఖాన్ న అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపగా అతనికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# ధాన్యం నిల్వలపై ఆకస్మిక తనిఖీలు

- **రైస్ మిల్లులపై మంత్రి ఆగ్రహం**
- **రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు**
- **మిల్లులు, గోదాముల వద్ద పోలీసు నిఘా**

**నాగర్‌కర్నూల్, మే 25**

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల మండలంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, నిల్వలు, లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్కడి నిర్వాహకులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రోజుల తరబడి ధాన్యం లారీలను అన్‌లోడ్ చేయకుండా నిలిపివేస్తున్న రైస్ మిల్లులపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. తాలు, తరుగు పేర్లతో రైతులకు నష్టం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతుల కష్టానికి సరైన విలువ దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

రైస్ మిల్లులు, గోదాముల వద్దకు వచ్చే ప్రతి లారీని వెంటనే అన్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు రాకూడదని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లారీల రాకపోకలు, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు ధాన్యం కొనుగోలు పరిస్థితులు, నిల్వ సామర్థ్యం, లారీల అన్‌లోడింగ్ వ్యవస్థపై మంత్రికి వివరించారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- **కంటైనర్ లారీని ఢీకొట్టిన డీసీఎం**
- **ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**
- **ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు**




**హైదరాబాద్, మే 25**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శామీర్‌పేట్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వేగంగా వచ్చిన డీసీఎం వెనుక నుండి ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో డీసీఎం ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో వాహనంలో చిక్కుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న వాహనం నుంచి గాయపడిన వ్యక్తిని బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా ఔటర్ రింగ్ రోడ్డుపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ప్రమాదానికి అతివేగం కారణమా లేక ఇతర సాంకేతిక కారణాలున్నాయా అనే దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాద సమయంలో వాతావరణ పరిస్థితులు, వాహనాల వేగం, రోడ్డుపై పరిస్థితులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల ఔటర్ రింగ్ రోడ్డుపై వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అతివేగంతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై నిలిపే సమయంలో భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు పేర్కొన్నారు.



# జెన్-జీ రాజకీయం

## మీమ్స్ దాటని నిరసన.. మారబోని వ్యవస్థ!

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంధియుగంలో ఉంది. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనది. సుమారు 145 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో 65 శాతానికి పైగా జనాభా 35 ఏళ్ల లోపు ఉన్నవారే. అంటే దేశ భవిష్యత్తును, పాలకుల తలరాతలను శాసించగల అపారమైన శక్తి నేటి 'జెన్–జీ' (నేటి తరం యువత) చేతుల్లో ఉంది. చట్టసభల్లో పాతకాలపు పాచిపోయిన విధానాలను తూర్పా రబడుతూ, అవినీతి అక్రమాలను నిలదీస్తూ యువతరం రాజకీయాల్లోకి దూసుకురావా ల్సిన సమయమిది. కానీ, దురదృష్టవశాత్తూ నేటి యువతరం క్షేత్రస్థాయి వీధి పోరాటాలను వదిలేసి, సామాజిక మాధ్యమాల వేదికగా 'మీమ్స్', వ్యంగ్యాస్త్రాలకే పరిమితమవుతోంది. ఓటు వేయడానికి బద్ధకిస్తూ, ఆన్‌లైన్ వేదికలపై ఫేక్ ఎజెండాలకు కోట్లల్లో లైకులు కొడు తూ కాలం వెళ్లదీస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'కాక్రోచ్ జన తా పార్టీ' (బొద్దింకల పార్టీ) వ్యవహారమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

### కోర్టు వ్యాఖ్యల వక్రీకరణ.. 'కాక్రోచ్' ఎజెండా!

అమెరికా నుంచి ఒక వ్యక్తి సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఆన్‌లైన్‌లో కోట్ల సంఖ్యలో లైకులు, 1.6 కోట్ల ఫాలోవర్లు రావడం రాత్రికి రాత్రే పెద్ద చర్చగా మారింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చారంటూ ఈ 'జెన్–జీ' సేన గొంతెత్తింది. అయితే, ఇక్కడ అసలు నిజాన్ని విస్మరించి గొర్రెల్లా మద్దతు తెలపడం దారుణం. ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా చెలామణి అవుతూ, సమాజంపై పడుతున్న కొందరు ఆర్‌టీఐ దళారులను ఉద్దేశించి న్యాయమూర్తి ఆ వ్యాఖ్యలు చేశారు. ఆ సందర్భాన్ని తెలుసుకోకుండా, కోర్టు ధిక్కరణకు పాల్పడేలా వ్యవస్థలపై బురదజల్లడం ఫ్యాషన్‌గా మారింది. ఈ పార్టీ వెనుక ఉన్న సూత్రధారుల గత చరిత్రను పరిశీలిస్తే.. ఇది పక్కాగా కాంగ్రెస్, ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) గేమ్ ప్లాన్‌లో భాగమనే విషయం స్పష్టమవుతోంది. నిరుద్యోగం, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ లాంటి అసలు సమస్యలను వదిలేసి, రిటైర్డ్ జడ్జిలను ఎంపీలుగా తీసుకోవద్దు, ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం అంటూ ప్రతిపక్షాల పొలిటికల్ ఎజెండాను మోయడం యువత అచేతనత్వానికి నిదర్శనం.

### గబ్బిలాల్లాంటి వారసత్వం.. ప్రశ్నించని తరం!

నిజానికి యువతరం గట్టిగా నిలదీయాల్సింది దేశాన్ని దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న వారసత్వ రాజకీయాలను, కుటుంబ పాలనను. చట్టసభల్లో కొన్ని కుటుంబాలే గబ్బిలాల్లా తరతరాలుగా పట్టుకుని వేలాడుతున్నాయి. దేశంలో ఏ పార్టీని చూసినా ఇదే తంతు. పార్లమెంటులో ఒకే కుటుంబం నుంచి సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలు ఉండాలి. అటు అధికార బీజేపీలో అమిత్ షా కుమారుడు ఏ అర్హతతో బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారో నిలదీసే నాథుడే లేడు.

తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు కుటుంబం నుంచి లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలే పదవుల్లో ఉండాలా? తెలంగాణలో ఒకప్పుడు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా ఏలిందో చూశాం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ వెంకటస్వామి కొడుకులు వివేక్, వినోద్, మనవడు వంశీలు ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరీల్లో ప్రజాప్రతినిధులుగా ఏలుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు ఒకే ఇంట నుంచి చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ దేశంలో, ఈ రాష్ట్రాల్లో వీరి కుటుంబాలు తప్ప వేరే నాయకులే లేరా? తెలంగాణ మలిదశ ఉద్యమంలో వేలాది మంది యువకులు బలిదానాలు చేసుకుంటే.. నేడు పదవులు, అధికారాలు మాత్రం కొన్ని కుటుంబాలకే పరిమితమవడాన్ని జెన్–జీ యువత ఎందుకు ప్రశ్నించడం లేదు?

### వీధి పోరాటాల నుండి వర్చువల్ ప్రపంచంలోకి..

ఒకప్పుడు భారత రాజకీయాల్లో యువత పాత్ర అనన్యసామాన్యం. స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్, ఆజాద్ వంటి యువకిశోరాలు ప్రాణాలర్పించారు. ఆ తర్వాత అస్సాంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' (ఆసు) చేసిన పోరాటం దేశ చరిత్రలోనే నిలిచిపోయింది. తెలంగాణ సాధనలోనూ ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులే రథసారథులయ్యారు. తీవ్రమైన చర్చలు, క్షేత్రస్థాయి వీధి పోరాటాల ద్వారా నాటి తరం వ్యవస్థలను కదిలించింది. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ తీవ్రత లోపించింది. విద్యావ్యవస్థ భ్రష్టు పడుతున్నా, వైద్యారోగ్య రంగం ప్రైవేటుకు తాకట్టు అవుతున్నా.. యువత కేవలం సోషల్ మీడియా 'ట్రెండ్స్' కే పరిమితమవుతోంది.

### సిద్ధాంతాలు లేని అవకాశవాదం

దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే పార్టీలు మారిపోతుంటారు. విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే ఇలాంటి అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ 'బొద్దింకల పార్టీ' నిలదీయగలిగితే మంచిదే. కానీ, అది మరో రాజకీయ పార్టీ సృష్టించిన తాత్కాలిక వేదిక ద్వారా సాధ్యం కాదు. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకరమైన వేదికలు అవసరం. నేర చరిత్ర లేని నాయకులు చట్టసభల్లో అడుగుపెట్టాలన్నా, భారత ప్రజాస్వామ్యం నిజంగా బలోపేతం కావాలన్నా యువత నిద్ర మేల్కోవాలి. కేవలం సామాజిక మాధ్యమాల్లో 'లైకులు', 'మీమ్స్' వేస్తూ కూర్చుంటే వ్యవస్థ మారదు. దేశ హితాన్ని కోరే నిజమైన ఎజెండాతో యువత నేరుగా రాజకీయాల్లోకి ప్రవేశించి, అక్రమార్కులను ఎండగట్టినప్పుడే నవభారత నిర్మాణం సాధ్యమవుతుంది.

# అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

- రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల కార్యక్రమం
- పలువురు ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలు
- కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు
- తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులకు పద్మ గౌరవం
- మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ



**న్యూఢిల్లీ, మే 25:** దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఏడాది మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలను ప్రకటించగా.. వారిలో ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ అవార్డులు లభించాయి. తొలి విడతగా సోమవారం 60 మందికి రాష్ట్రపతి స్వయంగా అవార్డులు అందజేశారు. తెలంగాణకు చెందిన ప్రముఖ వైద్యులు జి. వెంకట్రావు, డాక్టర్ పి. విజయ్ ఆనంద్ రెడ్డిలకు వైద్య రంగంలో చేసిన సేవలకు గాను పద్మ గౌరవం దక్కింది. అలాగే ప్రముఖ కూచిపూడి నర్తకి దీపికా రెడ్డికి కూడా పద్మ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశ అభివృద్ధికి వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఇక భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ఆమెకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డును ప్రదానం చేశారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రశంసించారు. గతేడాది భారత మహిళల జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్ కౌర్ చారిత్రాత్మక విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. మహిళా క్రికెట్‌లో ఆమె సాధించిన విజయాలకు గుర్తింపుగానే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

# నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

- గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టీఏ
- సుప్రీం ధర్మాసనం అసహనం




**న్యూఢిల్లీ, మే 25:** దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

## కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు : తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే



**న్యూఢిల్లీ, మే 25:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

# కాక్రోచ్ జనతాపార్టీపై అత్యవసర విచారణ

## అంతగా భావోద్వేగానికి గురికావద్దు

## తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం



**న్యూఢిల్లీ, మే 25:** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చడం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడుతుండడంతో సోమవారం న్యాయవాదులనుద్దే శించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతాపార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమయంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్‌కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా.. 'దానికంత భావోద్వేగానికి లోనుకావద్దు' అని సిజెఐ అన్నారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

## పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు

**న్యూఢిల్లీ, మే 25:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ. 8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 102.12, డీజిల్ రూ. 95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ. 115.58, డీజిల్ రూ. 103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ. 117.19, డీజిల్ రూ. 104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం



కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# సుంకర నరేష్ సేవా స్ఫూర్తికి అంతర్జాతీయ గుర్తింపు

**మానవ హక్కుల కార్యకర్త సుంకర నరేష్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు**





**కాప్రా, రాజముద్ర న్యూస్:** హైకోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త, సామాజిక సేవకుడు, కాప్రాకు చెందిన సుంకర నరేష్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డు లభించింది. సమాజ సేవలో విశిష్ట కృషి చేస్తున్న ఆయనకు లండన్ పార్లమెంట్ వెస్ట్‌మినిస్టర్ గుర్తింపు పొందిన "బీ ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ" ఆధ్వర్యంలో ఈ గౌరవం అందజేశారు. సంస్థ స్థాపకుడు రామ్ కళ్యాణ్ చల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏ డికేడ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్" కార్యక్రమం ద్వారా పదేళ్ల సామాజిక సేవా ప్రయాణాన్ని, అంతర్జాతీయ మానవతా సహకారాన్ని ఘనంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి లండన్ పార్లమెంట్ సభ్యుడు జిమ్ డిక్సన్, లార్డ్ ఉదయకుమార్ నాగరాజు మద్దతు తెలిపారు. ఆదివారం మాదాపూర్ మహీంద్రా క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సుంకర నరేష్ ఈ అవార్డును స్వీకరించారు. సమాజంలో తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, మాజీ సైనికులు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు, మూగజీవుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్న నరేష్‌కు ఈ గౌరవం దక్కడం విశేషంగా నిలిచింది. అంతే కాకుండా నేటి యువత సరైన దిశలో ముందుకు సాగేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్న ఆయన సేవలను నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా సుంకర నరేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న సంస్థ నుంచి ఈ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు ఈ గుర్తింపు కొత్త ఉత్సాహాన్ని, బాధ్యతను కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీనుబాబు, అరుణోదయ కళాకారిణి విమలక్క, సంస్థ సభ్యులు సుహాసిని, దేవ్, స్వప్న, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించాలి

- ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..
- అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (184) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల సింహావలోకనం సదస్సును విజయవంతం చేయండి

**కుషాయిగూడ ముదిరాజ్ సంఘం పిలుపు..**




**కాప్రా, రాజముద్ర న్యూస్:** ముదిరాజుల సింహావలోకనం సదస్సు ఈనెల 26వ తేదీన నెక్లెస్ రోడ్, జలవిహార్‌లోని గ్రాండ్ లైన్స్‌లో ముదిరాజ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జరగనున్న 'ముదిరాజుల సింహావలోకనం' సదస్సును విజయవంతం చేయాలని కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను చక్రిపురం క్రాస్ రోడ్, కుషాయిగూడలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు పిట్టల నాగరాజు ముదిరాజ్, కార్యదర్శి గడ్డల పాండు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎంపీ ఈటల రాజేందర్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ముదిరాజుల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు మరియు భవిష్యత్తు కార్యాచరణపై ఈ సదస్సులో కీలక చర్చ జరగనుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో ముదిరాజులు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని, వెనుకబడిన కులంగా ఉన్నారని స్పష్టమైందని నాయకులు గుర్తు చేశారు. 'మా జనాభాకు తగ్గట్లుగా మా వాటా' అనే నినాదంతో రాజకీయ, విద్యాపరమైన అవకాశాల కోసం తాము పోరాడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలనే తమ చిరకాల వాంఛను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నాయకులు శగాంటి రవి, బొల్లా శ్రీనివాస్, కొలిపాక కనకయ్య, రెడ్డబోయిన రాజు, పిట్టల భరత్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రికి రాత్రే రోడ్డు ఎత్తు పెంచేశారు.. ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం

**ఎరువుల గోడౌన్, అక్రమ రోడ్డు నిర్మాణంపై కలెక్టర్‌కు నేలకొండపల్లి వాసి ఫిర్యాదు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి గ్రామంలో ఇంటి ముందు అనధికారికంగా ఎరువుల గోడౌన్ నిర్మించడంతో పాటు, ఆ గోడౌన్ ఎత్తుకు సరిపడా రాత్రికి రాత్రే రోడ్డుకు మట్టి పోసి ఎత్తు పెంచారని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది.

**ఫిర్యాదు సారాంశం:** నేలకొండపల్లి గ్రామం సింగారెడ్డిపాలెంకు చెందిన నంవర్ల దేవీ ప్రసాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కూసుమంచి రోడ్డులో తమ ఇంటి ముందు భాగంలో జి. రామారావు అనధికారికంగా ఎరువుల షాప్ గోడౌన్‌ను చాలా ఎత్తులో కొత్తగా నిర్మించాడని తెలిపారు. అంతేకాకుండా ఆ గోడౌన్ ఎత్తుకు సరిపడే విధంగా రోడ్డుపై కూడా దౌర్జన్యంగా మట్టి పోసి ఎత్తు పెంచారని, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే రాత్రికి రాత్రే సీసీ రోడ్డు వేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**పంచాయతీ పెద్దల అండదండలు?**

జి. రామారావు, లింగం ఎల్లమంద ఇద్దరూ కలిసి అక్రమంగా ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, వారి వ్యాపార సౌలభ్యం కోసం పంచాయతీ పెద్దల అండదండలతో ఈ పనులు జరుగుతున్నాయని తమకు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**వర్షా కాలం భయం:**

ప్రస్తుతం కూసుమంచి మెయిన్ రోడ్డుకంటే చాలా ఎత్తుగా మట్టి పోయడంతో తమ ఇల్లు కింద స్థాయిలోకి వెళ్లిపోయిందని, వర్షాకాలంలో నీరు నేరుగా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని దేవీ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల గోడౌన్ వల్ల దుర్వాసన ఇళ్ల మధ్యకు వస్తోందని కూడా తెలిపారు.

**డిమాండ్లు:**

1. మెయిన్ రోడ్డును కల్వర్టు స్థాయికి సమాంతరంగా లెవల్ చేయాలి
2. అనధికార ఎరువుల గోడౌన్‌ను అక్కడి నుంచి తొలగించాలి
3. సంబంధిత అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి

# ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారులకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగింది. విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడం, విధులకు హాజరు కాకపోవడంపై డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆనంద్, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్, 108 కోఆర్డినేటర్ బి.రఘురాం లకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వివరణ కోరడం జరిగింది. ముందస్తు అనుమతి పొందకుండా ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు అందువల్ల విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడానికి గల కారణాలను తెలుపుతూ లిఖితపూర్వక వివరణను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వనట్లయితే సస్పెన్షన్‌తో సహా క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వివరణలో జాప్యం చేసినట్లయితే తదుపరి నోటీసు లేకుండా, అమలులో ఉన్న నియమ, నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అంతేకాక, అదే విషయం మళ్ళీ పునరావృతమైతే పని చేయడానికి ఆసక్తి లేదని భావించి, ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు ద్వారా తెలిపారు.

# ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారము కల్లెక్ట్రేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజావాణి ద్వార వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ, తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే, వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 189 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ . జడ్ పి సి ఇ ఓ సుధీర్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సదర్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు నూతన సదర్ సంఘం కార్యవర్గాన్ని పురిమి శెట్టి మున్నూరు కాపు సంఘ భవనంలో జరిగిన 14 బెడల జనరల్ బాడీ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు సదర్ సంఘం అధ్యక్షులు గా తోటరాములు, కార్యదర్శిగా బాల్‌దేవ్ రాజు, గౌరవ అధ్యక్షులుగా పోగుల దశరథ్,ఉపాధ్యక్షులుగా లచ్చనోళ్ల సత్తయ్య,గాండ్ల రమేష్ ,కోశాధికారిగా కొట్టె లింబాద్రి,జాయింట్ సెక్రెటరీగా కడెం శివ ప్రసాద్,కార్యవర్గ సభ్యులుగా బండి శ్రీనివాస్,పైడాకుల శంకర్,బీపేట రాములు,అర్గొండ రవి,నేరెళ్ల లింబాద్రి,బాలకొల్ల చిన్న బాలయ్య,లక్కకుల నడిపి రాజయ్యలను,సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షులు మాట్లాడుతూ మాజీ సంఘ పెద్ద మనుషులను కలుపుకొని సంఘం యొక్క అభివృద్ధికి సభ్యులందరినీ కలుపుకొని అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు,కుల సభ్యులందరికీ తనపై నమ్మకంతో సేవ చేసే బాధ్యతను అప్పగించినందుకు కుల సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో యువతి మృతి



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల పరిధిలోని గ్రామ శివారులో భీరప్ప పండుగ అనంతరం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఒక యువతి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే, రామారెడ్డి గ్రామానికి చెందిన రెడ్డి భూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 24.05.2026 న భీరప్ప పండుగ ముగిసిన అనంతరం ట్రాక్టర్ నెం. AP02BH8697 అతని బంధువు దింతల నర్సింలు నడుపుతూ రామారెడ్డి వైపు వస్తుండగా, పటేల్ చెరువు సమీపంలో నిర్లక్ష్యంగా, వేగంగా నడపడంతో అదుపుతప్పి ట్రాక్టర్ పొలంలో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముందు భాగంలో కూర్చున్న ఫిర్యాదుదారుడి పెద్ద కుమార్తె శ్రావ్య (19) తీవ్రంగా గాయపడగా, తలకు తీవ్ర రక్తస్రావం అయింది. ట్రాలీలో ప్రయాణిస్తున్న ఇతరులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి కామారెడ్డికి తరలించగా, శ్రావ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మెద్చల్‌లోని మెడినోవా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 21:07 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కాలనీల మధ్య బ్రిడ్జి పనులు, ఇతర సమస్యలపై వినతి

- నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప శ్రీనివాసరెడ్డి
- యువ నాయకులు కొకుంట్ల జీవన్ రెడ్డి



**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని హరితపూరి కాలనీ, విజయపురి కాలనీల మధ్యలో ఉన్న కనెక్టివిటీ బ్రిడ్జి గత సంవత్సరం 2025 ఆగస్టు నెలలో వర్షాకాలంలో కురిసిన వరదలకు బ్రిడ్జి కూలడంతో స్థానిక ప్రజలు గత తొమ్మిది పది నెలలుగా హరితపురి కాలనీ, విజయపురి కాలనీ వాసులు కనెక్టివిటీ దారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్నీ గ్రహించిన నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి,యువ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వత్ రెడ్డి లు కలిసి సోమవారం ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డిని కలిసి ప్రజల అవసరాల మేరకు తక్షణమే వంతెన పనులను చేపట్టి స్థానిక కాలనీ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని వినతి పత్రాన్ని సమర్పించారు. అలానే రాంపల్లి డబుల్ బెడ్ రూమ్స్ లో ఉన్న డ్రైనేజీ,నీటి సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపల్లి డబల్ బెడ్ రూమ్ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం వివోఏ ల యూనియన్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన



**గన్నేరువరం, రాజముద్ర న్యూస్:** గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ ఐకెపి వివో ఎలా సమస్యల పరిష్కారం కొరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి మండల సమైక్య ఎదురుగా గన్నేరువరం మండలం వివో ఎలా యూనియన్ ఆధ్వర్యంలో చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమాన్ని లొ గన్నేరువరం మండల ఐకెపి వివో ఎలా అధ్యక్షులు బుర్ర శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి శాంతియుత సమ్మె చేపట్టడం జరుగుతుంది అని ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలైనా కూడా వివో ఎలా వేతన పెంపుదల చేయడం లేదు మరియు శ్రమదోపిడికి గురవుతున్నాము అని తెలియజేశారు ప్రభుత్వం తన మేనిఫెస్టో పెట్టిన విధంగా ప్రతి వివో 20వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని మరియు హెచ్ఆర్ పాలసీవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని గన్నేరువరం మండల వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వివో ఎలా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు ఈ కార్యక్రమంలో వివో ఏల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్ మండల కార్యదర్శి వడ్లకొండ పద్మ కోశాధికారి నల్ల శ్రీజ ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ వివిధ గ్రామాల వివోఏలు పాల్గొనడం జరిగింది

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య**



**చేవెళ్ల, రాజముద్రం న్యూస్:** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి, అధిక దిగుబడును సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. సోమవారం రోజు ఆయన చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలోని పిఎసిఎస్ సొసైటీ నందు రైతులకు జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రంలోనే మొదటగా జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఘనత చేవెళ్ల నియోజకవర్గానికి దక్కుతుందన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి, అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జనుము విత్తనాల పూర్తి ధర క్వింటాలుకు రూ. 15,550, కానీ ప్రభుత్వ 50 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతు చెల్లించవలసిన రూ. 7775 రైతుకు 40 కేజీల జనుము విత్తనాల బ్యాగుకు రూ. 3110 చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పిఏసిఎస్ సభ్యులు, వ్యవసాయ అధికారులు,కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నెలవారీ మీటింగ్

**డాక్టర్ సురేష్**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** ఎన్ సి డి స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి 100% లక్ష్యాలను చేరుకోవాలి సస్పెక్టెడ్ కేసులు ఫాలోఅప్ క్లియరెన్స్ పూర్తి చేయాలి, ఏ ఎన్ సి రిజిస్ట్రేషన్లు 100% పూర్తి చేయాలి. ఏ ఎన్ సి 1/2/3/4 లేదా అంతకంటే ఎక్కువ చెకప్‌లు 100% చేయాలి.అనీమియా ఉన్న గర్భిణీలకు IFA టాబ్లెట్ల పంపిణీ 100% చేయాలి. టీబీ స్పుటమ్ ప్రీఎంప్టివ్ పరీక్షలు 100% చేయాలి. బ్లడ్ స్మియర్ కలెక్షన్ లక్ష్యాలను పూర్తిగా చేరుకోవాలి. 14 సంవత్సరాల బాలికలను హెచ్ పి వి వ్యాక్సినేషన్ కోసం ప్రోత్సహించి పీహెచ్ కు మొబిలైజ్ చేయాలి. కుటుంబ నియంత్రణ పద్ధతులను ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ ఫీల్డ్ స్థాయిలో నిర్వహించి, ఫోటోలను గ్రూపుల్లో షేర్ చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలను 80% కంటే ఎక్కువగా పెంచాలి. ముఖ్యంగా ప్రైమీ కేసుల్లో సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలి. ఈ-సంజీవని కాల్స్ లక్ష్యాలను చేరుకోవాలి. టెలీ-మనస్ సేవలను ప్రతిరోజూ నిర్వహించాలి. మానసిక ఆరోగ్య పరీక్షలను పి హెచ్ సి స్థాయిలో సైకియాట్రిస్ట్ ద్వారా నిర్వహించాలి.ఈ కార్యక్రమం లో హెల్త్ ఎడ్యుకేటర్ జార్జ్, ఎంఎల్ హెచ్ డా. రమ్యశ్రీ, రమ్య, పిహెచ్ సి స్టాఫ్, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# నాగారం రాంపల్లిలో భూకబ్జా కలకలం!

- కోర్టు స్టే ఉన్నా ఆగని దౌర్జన్యం.. బాధితుడిపై రౌడీమూకల దాడి..
- న్యాయం చేయాలంటూ రాచకొండ సీపీకి బాధితుల వేడుకోలు..





**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం రాంపల్లిలో భూదందా కలకలం రేపింది. న్యాయస్థానం స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ కబ్జాదారులు లెక్కచేయకుండా రౌడీ మూకలతో దౌర్జన్యానికి దిగారు. భూమిని కాపాడుకునేందుకు వెళ్లిన బాధితుడిపై 20 మందికి పైగా రౌడీలు ఏకమై అమానుషంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**బాధితుల కథనం ప్రకారం..**

నాగారం రాంపల్లి (ఐదవ డివిజన్) పరిధిలోని సర్వే నెంబర్ 406 లో ఉన్న స్థలాన్ని 2016 లో తాము 'ఆండాలు' అనే వ్యక్తి వద్ద చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు బాధితురాలు తెలిపారు. అయితే, కొంతకాలం తర్వాత కొందరు వ్యక్తులు అక్కడకు వచ్చి.. ఈ ల్యాండ్ తమదేనంటూ దౌర్జన్యంగా బెదిరింపులకు గురిచేశారు. కబ్జాదారుల వేధింపులు తట్టుకోలేక తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, సదరు స్థలంపై కోర్టు స్టే ఆర్డర్ (నిలిపివేత ఉత్తర్వులు) జారీ చేసింది.

**మొబైల్ లాక్కొని.. అడ్డువచ్చినందుకు చితకబాది..**

కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ కబ్జాదారులు పదే పదే రౌడీలను రప్పించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాడు కబ్జాదారులు ఏకంగా వివాదాస్పద స్థలంలో టెంట్ వేసి, జేసీబీ యంత్రంతో భూమిని లెవెల్ చేయడం ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త అక్కడకు చేరుకుని కోర్టు ఆర్డర్ ఉందని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన సుమారు 20 మంది రౌడీ మూకలు ఆయనపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. బాహ్య ప్రపంచానికి సమాచారం అందకుండా ఆయన చేతిలోని మొబైల్ ఫోన్‌ను దౌర్జన్యంగా లాక్కొని, తీవ్రంగా కొట్టి, అక్కడి నుంచి నెట్టివేశారు.

**రాచకొండ సీపీ చర్యలు తీసుకోవాలి:**

కళ్లముందే తమ భూమిని కబ్జా చేస్తూ, ప్రాణభయం కలిగిస్తున్న కబ్జాదారులపై రాచకొండ పోలీస్ కమిషనర్ (సీపీ) ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ రౌడీయిజానికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించి, తమకు ప్రాణరక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని బాధితులు కన్నీరుమున్నీరవుతూ వేడుకుంటున్నారు.

# వాహనాలకు హై బీమ్ లైట్స్ వాడితే.. చట్ట విరుద్ధం

- అనధికారిక లైట్లు, మిరమిట్లు గొల్పే ఎల్ఈడి లైట్లపై డ్రైవ్...
- కె. శివ శంకర్, సీఐ, జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్




**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సోమవారం మల్కాజ్గిరి కమిషనరేట్ వ్యాప్తంగా చేస్తున్న స్పెషల్ డ్రైవ్ లో అనధికారిక లైట్లు, మిరమిట్లు గొల్పే ఎల్ఈడి లైట్లు, అదనంగా ఫిట్ చేసిన లైట్లు, రంగురంగుల లైట్లు అలాగే పోలీస్, అంబులెన్స్, ఫైర్ ఎమర్జెన్సీ సర్వీసెస్ వాడేటువంటి నీలం ఎరుపు రంగు ఫ్లాష్ లైట్స్ వాడుతున్న వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఒక్క జవహర్ నగర్ ట్రాఫిక్ పి ఎస్ పరిధిలోనే 150 పైగా కేసులు నమోదు చేయడం జరిగింది కమిషనర్ వ్యాప్తంగా 2010 కేసులు నమోదు చేయడం జరిగింది. గతంలో వాహనాల హెడ్ లైట్స్ పైన సగం పైభాగం బ్లాక్ కలర్ స్టిక్కరింగ్ వేయడం ఉండేది, తద్వారా ఎదురుగా వచ్చే వాహనాలపై అత్యధిక వెలుగు లేకుండా ప్రమాదాలు నివారించడం కొరకు అలా చేసేవారు. కానీ ప్రస్తుతం ఉన్న వాహనాల అధునాతనమైన టెక్నాలజీ,హై బీమ్ లో బీమ్ లైటింగ్ సిస్టం ఉన్నందున ప్రజలు స్వీయ నియంత్రణతో రోడ్డును బట్టి లైట్స్ ను వాడవలసి ఉంటుంది. నేషనల్ హైవేస్, స్టేట్ హైవే ఓ ఆర్ ఆర్ లపై మాత్రమే హై బీమ్ లైట్స్ వాడవల్సి ఉంటుంది. మిగతా రోడ్లపై లో బీమ్ లైట్స్ మాత్రమే వాడాలి. కానీ ఈ విషయం చాలామంది వాహనదారులకు తెలియకపోవడం వల్ల జిల్లాల్లో పట్టణాల్లో గ్రామాల్లో డివైడర్ లేని చిన్న చిన్న రోడ్లపై కూడా ఈ హైబీం లైట్స్ వాడడం వల్ల ఎదురుగా వచ్చిన వాహనదారులకు ఏమి కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి ప్రజలు ఈ విషయాన్ని గమనించి కేవలం హైవేస్ ఓ ఆర్ ఆర్ పైన మాత్రమే హబీబ్ లైట్స్ యూస్ చేయాలి. ఒకవేళ కాదని మామూలు రోడ్లపై కూడా ఇలా హై బీము లైట్స్ వాడితే అది కూడా చట్ట విరుద్ధం దానిపై కఠిన చర్యలు తీసుకొనడం జరుగుతుంది సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. భారతీయ చట్టాల ప్రకారం, వాహన లైట్లను మార్చడం లేదా ప్రామాణికం కాని వాటిని అమర్చడం ఖచ్చితంగా నిషిద్ధం. కళ్ళు మిరుమిట్లు గొలిపే ఎల్ ఈ డి లైట్లు, వాహనం పైకప్పు పై అమర్చే లైట్ బార్‌లు, ఆమోదం లేని రంగుల లేదా మినుకు మినుకుమనే లైట్లు సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ (సిఎంవిఆర్), మోటార్ వెహికల్స్ యాక్ట్ (ఎంవిఏ)ను ఉల్లంఘిస్తాయి. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం, రిజిస్ట్రేషన్ రద్దు అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఫ్లాషర్లు (స్ట్రోబ్ లైట్లు) సిఎంవిఆర్ నియమం ప్రకారం , అధీకృత అత్యవసర (పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక), విపత్తు నిర్వహణ వాహనాలు మాత్రమే ఫ్లాషింగ్ లేదా రివాల్వింగ్ లైట్లను (ఎరుపు/నీలం) చట్టబద్ధంగా ఉపయోగించడం శ్రేయస్కరం అంటూజవహర్ నగర్ ట్రాఫిక్ సీఐ కె. శివ శంకర్ తెలిపారు.



## ఎస్ఆర్‌హెచ్‌పై అక్షర్ ప్రశంసలు


హైదరాబాద్, మే 25 : ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ పోరు ఉత్కంఠభరితంగా మారుతున్న వేళ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ అత్యంత ప్రమాదకర జట్లలో ఒకటిగా నిలిచిందని, వారి దూకుడైన బ్యాటింగ్‌ను అడ్డుకోవడం చాలా కష్టమని అక్షర్ పేర్కొన్నారు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో ఎస్ఆర్‌హెచ్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లు టాప్ టెన్‌లో ఉండటం జట్టు బలాన్ని చూపిస్తోందని ఆయన అన్నారు. హెన్రిచ్ క్లాసెన్ 14 మ్యాచ్‌ల్లో 606 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో కొనసాగుతున్నాడని గుర్తుచేశారు. అలాగే ఇషాన్ కిషన్ 569 పరుగులతో ఆరో స్థానంలో ఉండగా, అభిషేక్ శర్మ 563 పరుగులతో ఏడో స్థానంలో ఉన్నాడన్నారు. ప్రత్యేకంగా అభిషేక్ శర్మ ఈ సీజన్‌లో అత్యంత దూకుడుగా ఆడుతున్నాడని అక్షర్ ప్రశంసించారు. అతడి స్ట్రైక్ రేట్ 200 దాటడం చిన్న విషయం కాదన్నారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కలిసి జట్టుకు మెరుపు ఆరంభాలు అందిస్తున్నారని, దాంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు ఒత్తిడి లేకుండా ఆడగలుగుతున్నారని చెప్పారు. బ్యాటింగ్ మాత్రమే కాకుండా ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం కూడా సమతూకంగా కనిపిస్తోందని అక్షర్ అభిప్రాయపడ్డారు. ప్రత్యర్థి జట్లు ఎంత పెద్ద స్కోరు చేసినా ఛేదించే సామర్థ్యం హైదరాబాద్ జట్టుకు ఉందన్నారు. అందుకే ప్లేఆఫ్స్‌లో తాను ఎస్ఆర్‌హెచ్‌ను బలమైన జట్టుగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా బుధవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. లీగ్ దశలో హైదరాబాద్ 18 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగా, రాజస్థాన్ 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. మరోవైపు మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు పోటీ పడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేతతో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.



## టీ20ల్లో 200 పరుగులే లక్ష్యం

**ముంబై, మే 25 :** ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన భవిష్యత్ లక్ష్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 క్రికెట్‌లో వ్యక్తిగతంగా 200 పరుగులు సాధించిన తొలి బ్యాటర్‌గా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సీజన్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్న వైభవ్, ప్రస్తుతం టీ20ల్లో ఉన్న అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును బద్దలు కొట్టాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు టీ20 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. 2013 ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడిన గేల్, పూణె జట్టుపై అజేయంగా 175 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. ఆ రికార్డును అధిగమించాలని ఉందా అని ప్రశ్నించగా వైభవ్ సూటిగా స్పందించాడు. తాను ఆ రికార్డును తప్పకుండా బ్రేక్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు. ఒక మ్యాచ్‌లో పూర్తి 20 ఓవర్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభిస్తే 200 పరుగులు సాధించడం అసాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశాడు. యువ ఆటగాడి ఈ ధైర్యవంతమైన లక్ష్యం ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఐపీఎల్‌లో తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైభవ్, భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# ప్లేఆఫ్స్‌కు రంగం సిద్ధం





ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ముంబై ఇండియన్స్‌పై రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో టాప్-4 లో నిలిచి చివరి ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, రాజస్థాన్ అద్భుత ప్రదర్శనతో ఆ రెండు జట్లను రేసు నుండి పూర్తిగా తప్పించింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో కలిసి రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ సీజన్ లీగ్ మ్యాచ్‌ల ఉత్కంఠ ముగిసింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో కేవలం 15 బంతుల్లోనే 32 పరుగులు బాదడమే కాకుండా, బౌలింగ్‌లో 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 205 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ 175 పరుగులకే పరిమితమైంది. ముంబై బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. మే 26 తేదీన ధర్మశాల వేదికగా జరిగే క్వాలిఫైయర్-1 మ్యాచ్‌లో పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఆ తర్వాత మే 27 తేదీన ముల్లాన్‌పూర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఢీకొంటుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుండి నిష్క్రమిస్తుంది. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు, క్వాలిఫైయర్-1 లో ఓడిన జట్టుతో మే 29 తేదీన ముల్లాన్‌పూర్‌లోనే క్వాలిఫైయర్-2 మ్యాచ్ ఆడుతుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టు మే 31 తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే గ్రాండ్ ఫైనల్‌లో టైటిల్ కోసం పోరాడుతుంది. నిజానికి ఈ ఏడాది ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో జరగాల్సి ఉన్నప్పటికీ, కొన్ని స్థానిక భద్రతా కారణాల వల్ల బీసీసీఐ ఈ వేదికను అహ్మదాబాద్‌కు మారుస్తూ గతంలోనే నిర్ణయం తీసుకుంది.

# అదరగొట్టిన అర్జున్ టెండూల్కర్

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 )లో భాగంగా శనివారం పంజాబ్ కింగ్స్ తో జరిగిన పోరులో అతడు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నెగ్గి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 2025 వరకు కూడా అర్జున్ టెండూల్కర్ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఒకటి రెండు మ్యాచ్‌లు కూడా ఆడాడు. అయితే 2026 సీజన్‌కు ముందు ట్రేడ్ ద్వారా లక్నో సూపర్ జెయింట్స్‌కు మారాడు. రంజీల్లో కూడా ముంబై తరుఫున అవకాశాలు రావడం లేదనే ఉద్దేశంతో గోవాకు అర్జున్ టెండూల్కర్ మారాడు. ఇక లక్నోకు మారిన తర్వాత కూడా అర్జున్ టెండూల్కర్‌కు వెంటనే అవకాశాలు రాలేదు. తొలి 13 మ్యాచ్‌లకు అతడు డ్రింక్స్ మోస్తూ కనిపించాడు. అయితే 14వ మ్యాచ్‌లో లక్నో తరఫున ఆడే అవకాశం వచ్చింది. ఈ సీజన్‌లో లక్నో అట్టర్ ఫ్లాప్ ప్రదర్శన చేసింది. కేవలం 4 మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. 8 పాయింట్లతో సీజన్‌ను చివరి స్థానంతో ముగించింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అర్జున్ టెండూల్కర్‌కు అవకాశం రాగా.. తొలుత బ్యాటింగ్‌లో 5 బంతుల్లో 5 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇక బౌలింగ్‌లో మాత్రం ఆకట్టుకున్నాడు. 4 ఓవర్లు వేసిన అర్జున్ టెండూల్కర్ 36 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. అదే సమయంలో ఎన్నో మ్యాచ్‌ల అనుభవం ఉన్న ఇతర బౌలర్లు ధారాళంగా పరుగులు




సమర్పించుకున్నారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అర్జున్ టెండూల్కర్‌వే బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్. షమీ 2 వికెట్లు తీసినా 45 పరుగులు సమర్పించుకున్నాడు. ప్రిన్స్ యాదవ్ 3 ఓవర్లలో 32 పరుగులు.. మోసిన్ ఖాన్ 4 ఓవర్లలో 48 పరుగులు.. దిగ్వేష్ రాఠీ 3 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చుకున్నారు. వీరు ఈ సీజన్‌లో చాలా మ్యాచ్‌లే ఆడారు. అయితే వీరి కంటే అర్జున్ టెండూల్కర్ బెటర్‌గా బౌలింగ్ చేయడం విశేషం. అర్జున్ టెండూల్కర్ లక్నో డెబ్యూ అనంతరం సచిన్ టెండూల్కర్ ఎక్స్ వేదికగా ట్వీట్ వేశాడు. క్రికెట్‌లో సహనం చాలా ముఖ్యమన్నారు. తండ్రిగా గర్విస్తున్నానంటూ పేర్కొన్నాడు. నీకు ఎంతో ఇష్టమైన క్రికెట్ కోసం కష్టపడంటూ సలహా ఇచ్చాడు. ఈ క్రమంలో తొలి 13 మ్యాచ్‌ల్లో అవకాశాలు రాకపోయినా.. ఏ మాత్రం నిరాశ పడకుండా చివరి వరకు స్ఫూర్తితో ఉన్నావనే అదే నీకు అవకాశాన్ని తెచ్చిందని సచిన్ పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# సీఎస్కే జట్టులోకి హార్దిక్ పాండ్యా?

ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రదర్శన ఘోరంగా నిరాశపరిచింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టు ఈ సీజన్ లీగ్ దశలో నిలకడైన ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కూడా ఓడిపోవడంతో ముంబై జట్టు ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలతో పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పరిమితమైంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు కూడా ఈ సీజన్ ఓ పీడకలలా సాగింది. ఒకవైపు గాయాలు మరోవైపు పేలవమైన ఫామ్‌తో హార్దిక్ పాండ్యా తీవ్రంగా సతమతమయ్యాడు. ఈ సీజన్ ముగిసిన తర్వాత హార్దిక్‌ను ముంబై జట్టు ట్రేడింగ్ ద్వారా వేరే జట్టుకు పంపించబోతోందనే వార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హార్దిక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీసింది. హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ ఇంట్రెస్టింగ్ ఫోటోను పంచుకున్నాడు. ఆ ఫోటోలో ఒక లాప్‌టాప్, ఒక నోట్‌బుక్, ఒక పెన్, హార్దిక్ మొబైల్ ఫోన్ ఉన్నాయి. అయితే ఈ ఫోటోలో క్రికెట్ అభిమానుల కళ్లు నేరుగా హార్దిక్ మొబైల్ స్క్రీన్‌పై పడ్డాయి. ఆ ఫోన్ డిస్‌ప్లేపై సమయం “07:07” అని చూపిస్తోంది. ఈ నంబర్‌ను చూడటమే ఆలస్యం.. సోషల్ మీడియా యూజర్లు దీనికి టీమిండియా లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీతో లింక్ పెట్టడం ప్రారంభించారు. క్రికెట్ ప్రపంచంలో ‘7’ అనే నంబర్ ధోనీ జెర్సీ నంబర్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సోషల్ మీడియా 7 నంబర్ అనగానే ‘తలా ఫర్ ఏ రీజన్” ట్రెండ్ ఎంతలా వైరల్ అవుతుందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు హార్దిక్ ఫోన్‌లో సరిగ్గా 7 గంటల 7 నిమిషాలు ఉన్నప్పుడు స్క్రీన్‌షాట్ తీసి పోస్ట్ చేయడంతో.. ఇదంతా ధోనీ కోసమేనని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పైగా వచ్చే సీజన్‌లో హార్దిక్ పాండ్యా ముంబైని వీడి, ధోనీ మెంటార్‌గా ఉన్న సీఎస్కే(చెన్నై సూపర్ కింగ్స్) జట్టులోకి మారబోతున్నాడనే హింట్ ఇవ్వడానికే ఈ పోస్ట్ పెట్టాడంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ చర్చలపై హార్దిక్ కానీ, ముంబై యాజమాన్యం కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. మరోవైపు ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ ఈ సీజన్ వైఫల్యంపై స్పందిస్తూ.. హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఇప్పుడే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాడు. “ప్రస్తుతం జట్టు ప్రదర్శనపై పోస్టుమార్టమ్ చేయడానికి ఇది సరైన సమయం కాదు. ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా అది భావోద్వేగాలతో కూడుకున్నది అవుతుంది.



ఎక్కడ తప్పు జరిగిందో ప్రశాంతంగా కూర్చుని ఆలోచించడానికి ప్రతి ఒక్కరికీ కొంత సమయం, స్పేస్ కావాలి. అప్పుడే మేనేజ్మెంట్ పరంగా సరైన నిర్ణయాలు తీసుకోగలం. అంతేకానీ ఇప్పుడే హడావిడిగా హార్దిక్ భవిష్యత్తు గురించి మాట్లాడటం బాధ్యతారాహిత్యం అవుతుంది” అని కీరన్ పొలార్డ్ పేర్కొన్నాడు.



# థియేటర్ వివాదంలో రంగంలోకి చిరంజీవి

**హైదరాబాద్, మే 25 :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అమలుపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రమవడంతో పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగినట్లు సమాచారం. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు త్వరలో చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీపై ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉండగా, సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్డ్ రెంటల్ విధానమే కొనసాగుతోంది. ఇదే అంశంపై ఎగ్జిబిటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ వేదికల ప్రభావం, విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల నిర్వహణ భారంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే రకమైన అద్దె చెల్లించాల్సి రావడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతుండటంతో ఈ వివాదం మరింత వేడెక్కింది. జూన్ 4న విడుదల కానున్న ఈ సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో టికెట్ ధరల పెంపుపై కూడా ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే థియేటర్లకు ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోందని, అదనపు ధరలు విధిస్తే సాధారణ ప్రేక్షకులు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమలో సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో, ఈ వివాదానికి ఆయన మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.




# సర్జరీలపై అవికా గోర్ క్లారిటీ



సినీ పరిశ్రమలో అందం, ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో హీరోయిన్లపై తరచూ ప్లాస్టిక్ సర్జరీల ప్రచారం జరుగుతూనే ఉంటుంది. తాజాగా యంగ్ హీరోయిన్ అవికా గోర్‌పై కూడా ఇలాంటి రూమర్లు రావడంతో ఆమె వాటిపై ఘాటుగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అవికా గోర్ తన లుక్ గురించి వస్తున్న గాసిప్స్‌పై స్పందించింది. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ తర్వాత తన అందాన్ని మెయింటైన్ చేయడానికి ప్రత్యేక కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు తీసుకున్నారనే వార్తలపై ప్రశ్నించగా.. "నేను ఒక ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట నిజమే. కానీ అది అందం కోసం కాదు. ముఖంపై వచ్చిన పింపుల్స్ తగ్గించుకోవడానికి మాత్రమే ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. అది కూడా పెద్దగా పనిచేయలేదు" అని చెప్పింది. నటిగా కనిపించే తీరు కోసం అవసరాన్ని బట్టి పార్లర్‌కు వెళ్లేదానినని, కానీ ఎలాంటి పెద్ద సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది. "నేను ఏడేళ్ల వయసులోనే మేకప్ వేసుకోవడం ప్రారంభించాను. అందుకే చర్మాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ సన్‌స్క్రీన్ వాడేదానిని. మా అమ్మకు ఇలాంటి విషయాలంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. చిన్న టాటూ వేసుకున్నా, హెయిర్ కట్ చేసినా కూడా టెన్షన్ పడిపోయేది. అలాంటప్పుడు నేను పెద్ద కాస్మోటిక్ సర్జరీలు ఎలా చేయించుకుంటాను?" అంటూ ప్రశ్నించింది. తన శరీరంలో వచ్చిన మార్పులకు కారణం బరువు తగ్గడం, పెరగడమేనని అవికా తెలిపింది. "చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చి, వాళ్ల కళ్ల ముందే హీరోయిన్‌గా ఎదిగాను. నాకు చాలా త్వరగా బరువు పెరుగుతుంది, అలాగే తగ్గుతుంది కూడా. షూటింగ్ లేకపోతే తినడమే పని చేసేదానిని. వయసు పెరిగేకొద్దీ ప్రతి ఒక్కరిలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ నేను చిన్నప్పటి నుంచి అందరికీ తెలిసిన వ్యక్తిని కావడంతో, చిన్న మార్పు కనిపించినా సర్జరీలు చేశానని అనుకుంటున్నారు" అని చెప్పింది. అలాగే స్టార్ హీరోయిన్లు సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డేలను చూసి తాను కూడా ఫిట్‌గా మారాలని ప్రేరణ పొందానని అవికా తెలిపింది. ప్రస్తుతం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి బరువు తగ్గేందుకు కష్టపడుతున్నానని వెల్లడించింది.



# త్రిష 'లక్కీ ఛార్మ్'

సౌత్ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ స్టార్ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడం ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో "త్రిష లక్కీ ఛార్మ్" అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రముఖ హీరోల బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ "వారి విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది" అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. దీంతో ఈ అంశం మరింత హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి విజయ్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచింది. అలాగే అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో కూడా త్రిష కీలక పాత్ర పోషించింది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ అజిత్ కెరీర్‌లోనే పెద్ద హిట్‌గా నిలిచినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక చాలా కాలంగా సరైన విజయానికి ఎదురుచూస్తున్న సూర్య 'కరుప్పు' చిత్రంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు భారీ విజయాల్లో త్రిష హీరోయిన్‌గా ఉండటంతో అభిమానులు ఆమెను "లక్కీ ఛార్మ్" అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట మల్లిడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె 'అవని' పాత్రలో కనిపించనుండగా, సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రాశి సింగ్ గ్లామర్ షో..

## పచ్చటి చీరలో అదిరిపోయిన అందాలు



టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ హీరోయిన్ రాశి సింగ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా షేర్ చేసిన సాంప్రదాయ గ్లామరస్ ఫోటోలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. పచ్చటి రంగు చీరలో, హెవీ నగలతో, మినిమల్ మేకప్‌తో రాశి ఇచ్చిన ఫోజులు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. సంప్రదాయ కట్టులోనూ గ్లామర్‌ను మిళితం చేస్తూ ఆమె చేసిన ఫోటోషూట్‌కు నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో జన్మించిన రాశి సింగ్ చిన్నతనం నుంచే నటిగా ఎదగాలని కలలు కనేది. ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడాలనే ఉద్దేశంతో 18 ఏళ్ల వయసులోనే ఎయిర్ హోస్టెస్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించింది. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చిన ఆమె, నటనపై ఉన్న ఆసక్తితో ఆ ఉద్యోగాన్ని వదిలేసి సినీ రంగంలో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2021లో ఆది సాయికుమార్ హీరోగా వచ్చిన 'శశి' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమానే అయినప్పటికీ భాష తెలియకపోయినా కష్టపడి డైలాగులు నేర్చుకుని తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 'పోస్టర్', 'జెమ్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించిన రాశి సింగ్, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. 'భూతద్దం భాస్కర్ నారాయణ' చిత్రంలో జర్నలిస్ట్ లక్ష్మి పాత్రలో, 'ప్రసన్నవదనం' సినిమాలో ఏసీపీ వైదేహి పాత్రలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. అలాగే 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్' వంటి విభిన్న జానర్ చిత్రాల్లోనూ తన ప్రతిభను చాటుకుంది. వెండితెరతో పాటు డిజిటల్ వేదికలపైనా రాశి సింగ్ తన సత్తా చాటుతోంది. 'పాపం పసివాడు', 'త్రీ రోజెస్-2' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల్లో ఎక్కువగా సీరియస్, డీగ్లామరైజ్డ్ పాత్రల్లో కనిపించినప్పటికీ, నిజ జీవితంలో మాత్రం ఎంతో స్టైలిష్‌గా ఉంటుందని అభిమానులు చెబుతున్నారు. "నా సినిమాల్లో ప్రేక్షకులకు నా పాత్ర మాత్రమే కనిపించాలి" అనే భావనతో ముందుకు సాగుతున్న రాశి, సోషల్ మీడియాలో మాత్రం తన గ్లామర్ ఫోటోలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తాజాగా పచ్చటి చీరలో ఆమె చేసిన ఫోటోషూట్‌కు "అచ్చమైన తెలుగు అందం", "స్టన్నింగ్ లుక్", "సాంప్రదాయంలో గ్లామర్ క్వీన్" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం రాశి సింగ్ మరికొన్ని క్రేజీ టాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

# సమంత సినిమాకు విజయ్ షాక్?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. మొదట ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేయాలని భావించినప్పటికీ, ఐపీఎల్ ప్రభావం కారణంగా విడుదల వాయిదా పడింది. అనంతరం జూన్ 19న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది', జూన్ 26న రానున్న 'లెనిన్' మధ్య గ్యాప్‌ను ఉపయోగించుకుని సోలో రిలీజ్ ప్రయోజనం పొందాలని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ ప్రణాళికకు ఊహించని అడ్డంకి ఎదురైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకుడు' కూడా అదే తేదీన విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విజయ్ రాజకీయాల్లోకి పూర్తిగా అడుగుపెట్టే ముందు నటించిన చివరి సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వేదికల్లో జూన్ 19 విడుదల తేదీ కనిపించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. విజయ్‌కు తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ అభిమాన వర్గం ఉండటంతో 'జన నాయకుడు'కి పెద్ద ఎత్తున ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎక్కువగా విజయ్ సినిమాకే ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఇది 'మా ఇంటి బంగారం' థియేటర్ కేటాయింపులు, కలెక్షన్లపై ప్రభావం చూపవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి కంటెంట్ ఉన్నప్పటికీ స్క్రీన్ కౌంట్ తగ్గితే ఓపెనింగ్స్‌పై ప్రభావం పడటం సహజమేనని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి సమంత నిర్ణయంపైనే నిలిచింది. విజయ్ లాంటి భారీ స్టార్ సినిమాతో పోటీకి సిద్ధమవుతుందా? లేక వ్యాపారపరమైన లెక్కలు చూసుకుని మరోసారి విడుదల తేదీని మార్చుకుంటుందా? అనే అంశం ఆసక్తికరంగా మారింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com